# టాయిలెట్స్ లేక అవస్థలు

- తప్పని ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మాగనూర్ ప్రధాన కూడలిలోని వ్యాపార సముదాయాలు



మాగనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)

**మాగనూర్:** నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారితో మండల కేంద్రం కిటకిటలాడుతుంది. ప్రధానంగా బస్టాండ్ చౌరస్తాలో టాయిలెట్స్ లేక బస్సుకోసం వేచి ఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళ ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. టాయిలెట్స్ నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి టాయిలెట్స్ నిర్మించాలని కోరుతున్నారు.

**నిరుపయోగంగా..**

మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఆస్పత్రి ఏరియాతో పాటు ఇతర ప్రధాన కూడలిలో పబ్లిక్ టాయిలెట్లు లేవు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న టాయిలెట్ల నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, పల్లె ప్రగతి కార్యక్రమాలు చేపట్టినా ఇక్కడ వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంకోసం లక్షల నిధులు మంజూరు చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**ప్రయాణికుల అవస్థలు..**

నిత్యం హైదరాబాద్ నుంచి మండల కేంద్రం మీదుగా రాయచూర్, గోవా లాంటి ప్రాంతాలకు పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి మార్గంలో వస్తుంటాయి. వందలాది మంది ప్రయాణికుల రాకపోకలు నిత్యం కొనసాగుతుంటాయి. వీరంతా ఒంటికి, రెంటికి ఆరుబయటే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సమస్య పరిష్కరించాలి..



మండల కేంద్రంలో టాయిలెట్స్‌లేక వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చాలా సార్లు ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని మరుగుదొడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. - కనకరాజు, బీజేపీ నాయకుడు

### ఇబ్బందులు పడుతున్నాం..



ప్రధాన రహదారి వెంబడి మూత్రశాల, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి ప్రజలు అవసరాల నిమిత్తం వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - ఎండీ సుల్తాన్, మాగనూర్, వ్యాపారస్తుడు

### స్వచ్ఛ భారత్ కింద రూ. 10లక్షలు మంజూరు

గత రెండు నెలల కిందనే స్వచ్ఛ భారత్ కింద రూ. 10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం నిధులు అందుబాటులో ఉన్నాయి. గ్రామస్తులు మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించి ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేయాలి. - రహ్మతుద్దీన్, ఎంపీడీఓ

## క్లుప్తంగా

### తహసీల్దార్‌కు వినతి



**ఊట్కూరు:** మండలంలోని బిజ్వార్‌లో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేపట్టాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన ఇప్పటి వరకు రూ. 2లక్షల మాఫీ కాలేదని ఆయన ఆరోపించారు. వడ్లు అమ్మిన రైతులకు నెలలు గడిచిన రూ. 500 బోనస్ వారి ఖాతాలో జమకాలేదని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రుణ మాఫీని చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, కాలప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కొత్తపల్లి:** సీఎం సహాయనిధి చెక్కులను మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో వివిధ ఆస్పత్రులలో చికిత్స తీసుకొని సీఎం సహాయం కోసం అప్లైలు చేసుకోగా మంజూరైన చెక్కులను గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ శాంతికుమార్‌కు రూ. 57వేలు, విఠల్ నాయక్‌కు రూ.47వేల చెక్కులను గ్రామ కాంగ్రెస్ నాయకులు పార్థివ గౌడ్, చెన్నయ్య, నీలారెడ్డి అందజేశారు.

### రక్తదాన శిబిరం విజయవంతం



**నారాయణపేట రూరల్ :** కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. స్థానిక జీపీ శెట్టి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ హాజరై మాట్లాడారు. రక్తదానం చేయడంతో ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమాకాంత్, విజయ్ కుమార్, ప్రభాకర్ గౌడ్, రఘుపతి, జనార్దన్, శశిధర్, మధురెడ్డి పాల్గొన్నారు.

### ఎంపీఓకు వినతి



**మరికల్:** కుల గణన సర్వే డబ్బులు ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని కోరుతూ.. పీఆర్టీ యూ టీఎస్ ఆధ్వర్యంలో ఎంపీఓ పావనికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయం అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. నవీన్‌కుమార్, లక్ష్మయ్య, మధుసూదన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



**మాగనూర్:** మండల పరిధిలోని పర్కన్‌దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు దాత వెంకట్‌రెడ్డి రూ. 12వేల మైక్ సెట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హుస్సేన్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా మట్టి తరలింపు

**కృష్ణా:** మండలంలోని హిందుపూర్, ముడుమాల్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమార్కులు తరలిస్తున్న రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఆ గ్రామాల ప్రజలు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని మట్టిని ఇతర ప్రాంతాలకు రాత్రి, పగలు తరలిస్తున్న వాటిని అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మరికల్‌లో మాట్లాడుతున్న సిబ్బంది సంతోష

**మరికల్:** బాలికల సాధికారత, సమానత్వం సాధన దిశగా జరిగే కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది సంతోష, శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జ్యోతిబా పూలే పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత చదవులు చదివి తమ లక్ష్యాలను చేరుకోవడంలో ముందుండాలని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాల గురించి వారికి వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం



**మక్తల్:** మండలంలోని సంగంబండలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మలక్ష్మారెడ్డి శుక్రవారం రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పాలమూరు జిల్లా సహాయ కార్యదర్శి లింగారెడ్డి, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరిపంట పొలం పరిశీలన



**మద్దూరు:** మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన పల్లెం కనకప్ప వరి పొలంలో దోమ పోవడానికి కోయినూర్ పేరు ఉన్న మందును పిచికారి చేయడంతో చేనంతా ఎండిపోవడంతో శుక్రవారం ఏఓ రామకృష్ణకు వరిపైరును తీసుకొచ్చి చూయించారు. మిగిలిన మందును పాలకూర, కొత్తిమిరి తోటకు కొట్టడంతో పూర్తిగా ఎండిపోయాయని అధికారులు సూచించడంతో ఏఓ రామకృష్ణ, వరిపొలం, పాలకూర, కొత్తిమీర తోటలను పరిశీలించారు. ఈ పంటకు యూరియా, ఇతర మందులను కొట్టాలని సూచించారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ లింగయ్య

**నారాయణ పేట ఎడ్యుకేషన్:** ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతుల కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ లింగయ్య, డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. విద్యార్థులు మానసిక, శారీరకంగా ధృడంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ, సభ్యులు నరేష్, ఇంతియాజ్, చరణ్, వెంకటేష్, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాద్వార్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఆర్‌డీఏ మొగులప్ప

**మక్తల్:** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని డీఆర్‌డీఏ మొగులప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని మాద్వార్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.. అర్హులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని ఆయన అన్నారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీ ష్‌కుమార్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఏఓ మిథున్‌చక్రవర్తి, రాజు పాల్గొన్నారు.

**రసాభాసగా మారిన గ్రామ సభ**

**ఊట్కూరు:** మండలంలోని చిన్నపొర్లలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబితాను చదివి వినిపించారు. దీంతో తమ పేర్లులేవని పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని లబ్ధిదారులను శాంతించి గ్రామసభ సజావుగా సాగేవిధంగా చర్యలు తీసుకున్నారు.

**జలాల్‌పూర్‌లో..**

**నారాయణపేట రూరల్:** అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ**

**మద్దూరు:** మండలంలోని నాలుగు రోజులుగా కొనసాగుతున్న గ్రామసభల్లో వివిధ పథకాలకు దరఖాస్తుల వెల్లువ కొనసాగింది. చివరి రోజూ గ్రామల్లో నిర్వహించిన సభలో ఇళ్లకోసం 435, రేషన్‌కార్డులు 678, ఆత్మీయభరోసా కోసం 91 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



చిన్నపొర్ల గ్రామ సభలో

**వర్కూర్‌లో..**

**మాగనూర్:** మండలంలోని వర్కూర్‌లో ఇళ్ల జాబితాలో తమ పేర్లు లేవని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అక్కడే ఉన్న పోలీసులు వారికి నచ్చచెప్పి శాంతింప చేశారు. పథకాలు నిజమైన అర్హులకు చేరేలా చూడాలని అధికారులను కోరారు.

**అధికారులను నిలదీసిన గ్రామస్తులు**

**కొత్తపల్లి:** మండలంలోని నిర్వహించిన గ్రామ సభలో అధికారులు లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. జాబితాలో ఉద్యోగస్తులు, అనర్హుల పేర్లు రావడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ జయరాములు, ఎంఆర్ఐ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

**కోస్గిరూరల్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను అర్హులందరికీ వర్తింపచేస్తామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8, 9, 13 వార్డులలో చేపట్టిన గ్రామ సభలలో తీర్మానాలను ఆమోదించారు. సర్వే సమయంలో లేని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.



మద్దూరులో..



కొత్తపల్లి గ్రామ సభలో..



జలాల్ పూర్ గ్రామసభలో

## నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

**కోస్గి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. వంటగదిలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూప్రకారం తాజా కూరగాయలతో ఆహారం వడ్డించాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని కోరారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, ఏంఆర్ఐ సభాష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**కోస్గి రూరల్:** ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టడంతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం పలువురు మాట్లాడారు.. మున్సిపల్‌లో అక్రమ నిర్మాణాలను చేపట్టి మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్న పట్టించుకోవడం లేదని, దీనికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రోత్సాహిస్తున్నారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌నర్సింహులు, కోనేరు సాయప్ప, హన్మంతు, మోహన్‌గౌడ్, మల్లేష్, రుక్మప్ప, వెంకట్రాములు, నీరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపల్లి:** పథకాల పేరుతో దరఖాస్తులను తీసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. హామీల విషయంలో గ్రామ సభలో అధికారులను అడుగుతుంటే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. మధుసూదన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, మణి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## సేవాగుణం అలవర్చుకోవాలి..



ధర్మజాగృతి ప్రవచనంలో పాల్గొన్న పీఠాధిపతి

**ఊట్కూరు:** ప్రతి ఒక్కరిలో దైవభక్తితో పాటు సేవా గుణం అలవర్చుకోవాలని శ్రీ సిద్ధలింగేశ్వర నేరేడ్గం పీఠాధిపతి అన్నారు. మండలంలోని మూడు రోజులుగా కొనసాగుతున్న ధర్మజాగృతి ప్రవచనాల కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా గ్రామంలో నగర సంకీర్తన ప్రవచనం చేపట్టినట్లు తెలిపారు. మఠం ఆధ్వర్యంలో అధ్యాత్మిక ధార్మిక రంగాలనే కాకుండా విద్యా, సామాజిక, సంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మార్చి 16, 17, 18 తేదీలలో సిద్ధిలింగేశ్వరస్వామి జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, సూర్యప్రకాష్‌రెడ్డి, గౌరయ్యస్వామి, విరుపాక్షిస్వామి, అరవింద్‌కుమార్, కృష్ణయ్యగౌడ్, శెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ లీకేజీ పట్టదా!



**మరికల్:** మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలోని రాయిచూర్ పక్కన మిషన్ భగీరథ లీకేజీ అధికారులకు పట్టనట్లు ఉంది. ఆరునెలల నుంచి ఇక్కడ పైపులైన్ కావడంతో తాగునీరు కలుషితమవుతుంది. తుతూమాత్రంగా మరమ్మతు చేయడంతో మళ్లీ లీకేజీ కావడంతో గ్రామాలకు కలుషితనీరు సరఫరా అవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## పట్టణాభివృద్ధికి కృషి చేశాం

- వీడ్కోలు సమావేశంలో మున్సిపల్ పాలకవర్గం



సన్మానంలో పాల్గొన్న మున్సిపల్ పాలకమండలి

**అమరచింత:** పదవిలో ఉన్నంత కాలం పట్టణాభివృద్ధికి ఎనలేని కృషి చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు అన్నారు. అమరచింత మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగింపు సందర్భంగా కౌన్సిలర్లను కార్యలయం సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి మాట్లాడుతూ పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనుకున్నా.. నిధులు మంజూరు కాకపోవడంతో ఆశించిన మేరకు అభివృద్ధి జరగలేదన్నారు. బీసీ కాలనీలోని 7వ వార్డులో కనీసం డ్రెయినేజీ కూడా నిర్మించలేదన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త నాగభూషణంగౌడ్ కారణంగానే పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని దుయ్యబట్టారు. అభివృద్ధి వ్యవహారంలో కౌన్సిలర్లను కలుపుకొని పోవాలని పలుమార్లు విన్నవించినా చైర్‌పర్సన్ భర్త ఒంటెద్దు పోకడలు పోయారని ఆరోపించారు. అవకాశం అందివస్తే పట్టణాభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కౌన్సిలర్లు లక్ష్మి, లావణ్య, సింధు, మాధవి, ఉషారాణి, విజయరాములు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలి

**అమరచింత:** మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులతో కలిసి బాలికా సాధికారిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రాధిక చిన్నారులకు హారతి ఇచ్చి గౌరవించారు. బాలికను 'బతకనిద్దాం–బాలికను చదువుకోనిద్దాం' అంటూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.



చిన్నారులకు హారతి ఇస్తున్న తల్లులు

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిచేస్తున్న అధికారులు, నాయకులు

**మద్దూరు:** మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో ఇక్కడ నిర్మిస్తామని గృహనిర్మాణ శాఖ డీఈ శంకర్ తెలిపారు. నెల రోజుల్లో ఇంటినిర్మాణం పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఏఎంసీ చైర్మన్ భీములు, కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

## ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

**ఆత్మకూర్:** దివ్యఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని హజ్రత్ మౌలానా ఫక్రుద్దీన్ అన్సారీ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక మస్జిదేనూర్‌లో పట్టణంలోని మక్తబ్ మదర్సా జియాఉల్ ఖురాన్ (అరబ్బీపాఠశాల) విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా మౌలానాలు ఇఫ్తేఖార్, ఎజాజ్‌సాబ్, సుబూర్‌ఖాన్, సఫ్దర్‌హుస్సేన్, అబ్రార్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహువలై వసల్లం సూక్తులు ఆచరనీయమని, ప్రతి ముస్లిం తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదుపూటలు నమాజ్ ఆచరించడంతో పాటు దాన, ధర్మాలు చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ హాఫీజ్ ఫక్రుద్దీన్, హాఫీజ్ ముక్తదీర్, మౌలాన అబ్దుల్‌అలీం రషాది, రిటైర్డ్ ఎంఈఓ యూసూఫ్‌సాబ్, అబ్దుల్‌వాహేద్ పాల్గొన్నారు.